ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
మంగళవారం 30 జనవరి 2024



డీఐజీ సెంథిల్ కుమార్ బదిలీ

కర్నూలు, జనవరి 29: కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ ఆక్టోపస్ డీఐజీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కాకినాడ ఏపీఎస్పీ థర్డ్ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్ విజయరావును నియమించారు. అదేవిధంగా సెబ్ ఏఎస్పీ కృష్ణకాంత్ పాటిల్.. కాకినాడ ఏపీఎస్పీ థర్డ్ బెటాలియన్‌కు కమాండెంట్‌గా బదిలీ అయ్యారు.

నంద్యాలలో సారా రాజ్యం నడుస్తోందనే విమర్శలు ఉన్నాయి. పేదలు చెమటోడ్చి సంపాదించిన సొమ్మును నాటు సారాయికి ఖర్చు పెట్టేస్తున్నారు. తాగి, తూలి ఒళ్లు, ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. సారా నిషేధం తమ ప్రభుత్వ విధానమని గత ఎన్నికల్లో ప్రకటించిన వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ఆ మాటే మర్చిపోయారు. నంద్యాల పట్టణంలో సారా సామ్రాజ్యం నడుస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. సారాయికి తోడు జూదం, మట్కా నలు దిక్కులా విస్తరించాయి. వీరి బారిన పడి సామాన్య, మధ్య తరగతి ప్రజలు నలిగిపోతున్నారు. సందుగొందుల్లో, కిళ్లీ కొట్లు, బడ్డీ కొట్లలో కూడా గుట్కా విక్రయాలు సాగుతున్నట్లు తెలుస్తోంది



నంద్యాల పరిసర ప్రాంతాల్లో సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు (ఫైల్)



సారాజ్యం..!

- జోరుగా నాటుసారా తయారీ, విక్రయం
- నామ మాత్రంగా నియంత్రణ చర్యలు
- గుట్టుచప్పుడు కాకుండా మట్కా, పేకాట
- వ్యసనాలతో పేదల జేబుకు చిల్లు

నంద్యాల క్రైం, జనవరి 29 : నంద్యాలలో సారా వ్యాపారం జోరుగా సాగుతోంది. రోజంతా కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించిన కూలి డబ్బుల్లో సగానికిపైగా సారా, గుట్కా, మట్కాలకే తగలేస్తున్న కూలీలు ఎందరో. సారా విక్రేతలు, మట్కా బీటర్లు, గుట్కా విక్రయదారులు పేదల జీవితాలను ఛిద్రం చేస్తున్నారు. పట్టణంలో చాలా చోట్ల గుట్టుచప్పుడు కాకుండా ఈ విక్రయాలు నడుస్తున్నాయి. అలాగే జూదం. పేకాటలో అందర్.. బహర్.. మూడు ముక్కలాట, సిండికేట్, రమ్మి తదితర జూదాలు పెరిగిపోతున్నాయి. పైగా ఆన్‌లైన్ గేమింగ్‌లు వెరసి సామాన్యుడి బతుకును భారం చేస్తున్నాయి. మట్కాలో ఒక రూపాయకు 80రూపాయలు వస్తాయనే ఆశతో చాలామంది వ్యసనానికి బానిసలయ్యారు. మట్కా బీటర్లు ఎవరో.. గుట్కాలు ఎక్కడెక్కడ ఎవరు విక్రయిస్తున్నారో.. జూద గృహాలు, పేకాట స్థావరాలు ఏవో పోలీసులకు తెలిసినా దాడులు చేయడం లేదనే ఆరోపణ ఉంది. అసాంఘిక కార్యకలాపాలపై ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక ఆదేశాలు వస్తే తప్ప దాడులు గట్రా ఉండవని ప్రజలు అంటున్నారు. . పైగా జూద గృహాల నిర్వాహకులు, గుట్కా విక్రేతలు, మట్కా బీటర్లు కొందరు పోలీసులతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లు కూడా తెలుస్తోంది. ఈ కారణంగానే దాడులు జరిగే సమాచారాన్ని ముందుగానే లీక్ చేస్తుండటంతో పూర్తిస్థాయిలో పోలీసుల కష్టం ఫలించడంలేదనే వాదనలు వున్నాయి.

చాపకింద నీరులా సారా

జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలలో నాటు సారా బట్టీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు, సెబ్ సిబ్బంది ఎప్పటికప్పుడు ముమ్మరంగా దాడులు, తనిఖీలు చేపడుతున్నా వారి కళ్లు గప్పి వేరే ప్రాంతాల్లో తమ వ్యాపారాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. నిత్యం జిల్లాలో ఏదో ఒక చోట నాటుసారా బట్టీలపై పోలీసులు, సెబ్ సిబ్బంది దాడులు చేస్తుండటమే ఇందుకు నిదర్శనం. ఇటీవలే నాటుసారా బట్టీలపై దాడులు చేసి 26కేసులు నమోదు చేసి 14మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 182లీటర్ల సారా సీజ్ చేశారు. 10డీపీఎల్ కేసుల్లో 325డీపీఎల్ మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. జూపాడుబంగ్లా పోలీసు స్టేషన్ పరిధిలో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసి 15మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10 కోళ్లను, 40మోటార్‌సైకిళ్లతోపాటు రూ.19వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా వ్యాపారం విషయంలో సెబ్ సిబ్బంది, పోలీసులు నామ మాత్రంగా దాడులు మాత్రమే చేస్తున్నారు. పట్టణంలోని దళితవాడలో నాటు సారా పెద్ద ఎత్తున తయారవుతున్నది. ఎక్సైజ్ పోలీసులు దాడులు చేయడానికి బయల్దేరే ముందు సారా తయారీ దారులకు సమాచారం వెళుతుందని, అధికారులు వెళ్లే సరికి వాళ్లు పరారవుతారని, అధికారులు సారా స్వాధీనం చేసుకొని, నాటుసారాను అరికడుతున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ తయారైన నాటుసారా స్థానికంగా విక్రయం కావడమేగాక, ఆళ్లగడ్డలాంటి ఇతర ప్రాంతాలకు సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఒక స్థానిక ప్రజాప్రతినిధి అండ ఉందనే ఆరోపణలు ఉన్నాయి.

గుట్టుగా గుట్కా

నంద్యాల జిల్లా కేంద్రంలోని ఏ సందులో చూసినా గుట్కా విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను ఇతర పాన్ మసాలాలతో కలిపి గుట్టుగా విక్రయిస్తున్నారు. గుట్కాలు, ఖైనీలు, పొగాకు ఉత్పత్తుల వల్ల క్యాన్సర్, ఇతరత్రా రోగాలు వస్తాయని ప్రభుత్వం వాటిని నిషేధించినా తయారీదారులు, విక్రేతలకు పట్టడం లేదు. వీటికి అలవాటుపడినవారు కూడా ప్రభుత్వ ఆదేశాలను బే ఖాతర్ చేస్తున్నారు.



నంద్యాలలో పట్టుబడిన గుట్కా ప్యాకెట్లు (ఫైల్)

జోరుగా పేకాట

పేకాటకు కూడా అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పేకాటకు ప్రధానంగా పట్టణ శివారులోని నిర్మానుష్య ప్రాంతాలు, పట్టణంలోనే రహస్య ప్రదేశాలను ఎంచుకొని నిర్వహిస్తుంటారు. ప్రధానంగా కొన్ని లాడ్జీలు, ప్రైవేట్ రూమ్‌లు, కొందరు జూద నిర్వాహకుల ఇళ్లు వీటికి అడ్డాగా మారుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు దాడులు చేసి అరెస్టులు చేసినా జూద గృహాల నిర్వాహకుల తీరు మారనట్లు తెలుస్తోంది. కొన్నిసార్లు దాడులు చేసే సమాచారాన్ని ముందే తెలుసుకొని అప్రమత్తమవుతుంటారనే వాదన కూడా ఉంది. నంద్యాల తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల పేకాట ఆడుతున్న వారిపై దాడులు చేసి 12మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,28,600నగదు స్వాధీనం చేసుకున్నారు.





సైలెంట్‌గా మట్కా

పట్టణంలోని పలు ప్రాంతాల్లో మట్కా బీటర్లు మట్కా వ్యాపారాన్ని రహస్యంగా, సైలెంట్‌గా కొనసాగిస్తున్నట్లు సమాచారం. రోజువారీ కూలి చేసుకునేవారు, కార్మికులు, రిక్షా కార్మికులు తదితరులు తాము సంపాదించిన దాంట్లో ఎక్కువ భాగం మట్కా జూదంలో పెట్టి నష్టపోతున్నారు. మట్కా బీటర్లు తెలిసినవారి నుంచి వారి ద్వారా ఇతరులతో గుట్టుగా వ్యాపారం సాగిస్తున్నారు. మట్కాలో ఓపెన్, క్లోజ్ అనే రకాలు కూడా ఉన్నాయి. ఓపెన్ కేటగిరీలో సింగిల్ నెంబర్ ఉంటుంది. ఓపెన్ కింద సింగిల్ నెంబర్ తగిలితే ఇంత.. క్లోజ్ విభాగంలో సింగిల్ నెంబర్ తగిలితే ఇంత అని మట్కా కంపెనీలు, బీటర్లు నిర్ణయించి ఇస్తుంటారు. ఇక మట్కా మెయిన్ విభాగంలో డబుల్ నెంబర్ కింద తగిలితే ఒక రూపాయికి కొన్ని కంపెనీలు, బీటర్లు 70రూపాయలు ఇస్తే, మరికొన్ని కంపెనీలు, బీటర్లు 80రూపాయలు ఇస్తుంటారని మట్కా ప్రేమికులు పేర్కొంటున్నారు. ఇటీవలే జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మట్కా కేసు నమోదు చేసి రూ.3900 నగదు స్వాధీనం చేసుకున్నారు.

బీసీలను అణగదొక్కిన జగన్

వైసీపీకి పుట్టగతులు లేకుండా చేయాలి: ఎన్ఎండీ ఫరూక్, మల్లెల రాజశేఖర్



గోస్పాడు బీసీ జయహో సభలో ఫరూక్, రాజశేఖర్ తదితరులు

గోస్పాడు, జనవరి 29: రాష్ట్రంలో బీసీ కులాలన్నింటినీ జగన్ ప్రభుత్వం అణగదొక్కిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం గోస్పాడులో జయహో బీసీ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఫరూక్, రాజశేఖర్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి బీసీల ఆర్థిక, రాజకీయ పురోభివృద్ధికి బాటలు వేసిందని అన్నారు. రాజకీయంగా బీసీలు ఎదిగేందుకు టీడీపీ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన విషయం ప్రజలందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఒక్క చాన్స్ అంటూ అన్ని వర్గాల ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన జగన్ బీసీలకు ఎలాంటి చేయూత అందించలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి పుట్టగతులు లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రారావు, తాతిరెడ్డి తులసిరెడ్డి, వలసల రామకృష్ణ, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందనాయుడు, వాల్మీకి సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు బోయ రామకృష్ణ, దూదేకుల ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బాబన్, టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జైనాబీ, మండల టీడీపీ నాయకులు శీలం భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్, తులసీశ్వరరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, భూమా హుసేని, పెద్దహుసేని, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివయ్యకు స్వర్ణ పుష్పాలు





బంగారు, వెండి పుష్పాలు

శ్రీశైలం, జనవరి 29: శ్రీశైల మల్లికార్జున స్వామికి సోమవారం పలువురు భక్తులు బంగారు, వెండి పుష్పాలను సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన మురళి కుటుంబ సభ్యులతో కలిసి బంగారు, వెండి పుష్పాలను సమర్పించారు. ఇందులో 82 గ్రాముల బంగారంతో చేసిన 8 తామర పువ్వు ఆకారంలో పుష్పాలు, మరో 110 వెండి పుష్పాలు ఉన్నాయి. వీటి విలువ రూ.5.45 లక్షల ఉంటుందని దాత తెలిపారు. వీటిని భక్తులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వేదాశీర్వచన మండపంలో దేవస్థానం వసతి విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి ఐఎన్‌వీ మోహన్, పర్యవేక్షకుడు స్వామికి అందజేశారు.

రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

అధికారుల నిర్లక్ష్యంతో విసుగు చెందిన వైనం
కలెక్టర్ కార్యాలయం ముందు ఘటన

నంద్యాల (కల్చరల్), జనవరి 29: పొలం సమస్య పరిష్కరించాలని అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగినా వాళ్లు పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురైన వికలాంగ రైతు దంపతులు కలెక్టర్ కార్యాలయం ముందు వంటిపైకి పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన సోమవారం జరిగింది. రుద్రవరం మండలం చిన్నకంబలూరు గ్రామానికి చెందిని దళిత రైతు సుధాకర్‌కు సర్వేనెంబరు 270-2లో 3 ఎకరాలకు ప్రభుత్వం డీ పట్టా ఇచ్చింది. దీని పై గ్రామానికి చెందిన కొమ్ము నారాయణ, మాన్‌కింది నడిపి రామాంజనేయులు, మాన్‌కింది బాల ఆంజేయులు, మాన్‌కింది వరలక్ష్మి నకిలీ పట్టాలు సృష్టించి కోర్టులో కేసు వేశారు. దీనిపై న్యాయస్థానం విచారించి తీర్పు ఇచ్చింది. ఈ మేరకు తాము ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ పలుసార్లు ప్రదక్షిణ చేసినా పట్టించుకోలేదు. భూమి తమకు దక్కదనే ఉద్దేశంతో దళిత రైతు దంపతులు నంద్యాల కలెక్టర్ కార్యాలయం ముందు వంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పరిసరాలలో వున్న పోలీసులు గమనించి పెట్రోలు పోసుకోకుండా కాపాడారు. డీఆర్వో పుల్లయ్య స్పందిస్తూ తక్షణమే సుధాకర్‌కు పొలం పొలాన్ని అప్పజెప్పాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.



రైతు దంపతులు పెట్రోలు పోసుకుంటుండగా పోలీసు వచ్చి పక్కకు లాగేస్తున్న దృశ్యం

జగనన్నా.. హైకోర్టు ఎక్కడన్నా..?

- హంద్రీనీవా పూర్తి చేయలేని అసమర్థుడు
- నాసికరం మద్యంతో పెరిగిన మరణాలు
- ప్రత్యేక హోదాపై బీజేపీని ప్రశ్నించే దమ్ముందా?
- సీఎం జగన్‌పై వైఎస్ షర్మిల ఫైర్
- ఉమ్మడి జిల్లా కార్యకర్తలతో సమావేశం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న షర్మిల



కత్తిని చూపుతున్న షర్మిల

కర్నూలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి)/కర్నూలు అర్బన్: హైకోర్టు ఏమైంది జగనన్నా...' అంటూ ఏపీసీసీ చీఫ్ షర్మిల సీఎం జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల సోమవారం తొలిసారి కర్నూలు జిల్లాకు వచ్చారు. నగరంలోని తనిష్క్ ఫంక్షన్ హాల్‌లో కర్నూలు, నంద్యాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఆయా జిల్లాల డీసీసీ అధ్యక్షులు బాబురావు, జె.లక్ష్మీనరసింహయాదవ్ అధ్యక్షతన జరిగింది. సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, జేడీ శీలం, కేవీపీ రామచంద్రరావు, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన జగనన్న కర్నూలుకు న్యాయ రాజధాని చేస్తానని చెప్పాడని గుర్తు చేశారు. హైకోర్టు ఏమైందో చెప్పాలని ప్రశ్నించారు. ఆనాటి రాజశేఖరరెడ్డి పాలనకు.. ఇప్పటి జగనన్న పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. జగనన్న పాలనలో రాష్ట్ర పరిస్థితి ఘోరంగా మారిందన్నారు. ఎక్కడికెళ్లినా సమస్యలే.. ఈ ప్రభుత్వంపై పోరాటం చేయకపోతే మనం బాగుపడే పరిస్థితి లేదన్నారు. జగన్ ప్రభుత్వంపై పోరాటానికి నేను సిద్ధం.. మీరు సిద్ధమా..? అంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మతతత్వ బీజేపీకి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వ్యతిరేకి అయితే జగన్ బానిసగా మారాడని షర్మిల ధ్వజమెత్తారు.

నాసిరకం లిక్కర్ తాగొద్దు..

'సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక హోదా తేలేదు కానీ.. స్పెషల్ స్టేటస్ అంటూ నాసిరకం మందు తెచ్చి ప్రజల ప్రాణాలను హరిస్తున్నాడు. ఈ వైసీపీ పాలనలో ఇష్టం ఉన్నా లేకున్నా అమ్మిందే తాగాలి.. చెప్పిన ధరకే కొనుగోలు చేయాలి. డిజిటల్ చెల్లింపులు లేవు.. ఓన్లీ క్యాష్. దేశంలో ఇలాంటి పరిస్థితి ఏ రాష్ట్రంలోనైనా ఉందా? నాసిరకం మద్యం తాగడం వల్ల లివర్ చెడిపోయి ప్రాణాలు పోతున్నాయి. ఈ పాపం నీది కాదా జగనన్నా..' అని షర్మిల ప్రశ్నించారు. ఇలాంటి నాసిరకం మందు తాగకండి అని మందుబాబులకు ఆమె పిలుపునిచ్చారు.

జగన్ ఓ అసమర్థుడు

రాయలసీమకు జీవనాడిగా ఉన్న హంద్రీనీవా పనులు పదిశాతం పెండింగ్‌లో ఉన్నాయి. కనీసం ఆ పనులను కూడా పూర్తి చేయలేని అసమర్థుడు సీఎం జగన్ అని షర్మిల ధ్వజమెత్తారు. కనీసం రైతులకు పంటల బీమా కూడా ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారన్నారు. రాబోయే ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని, 73 రోజుల ఇంటింటికి వెళ్లి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి బీజేపీ బానిస పార్టీలను ఇంటికి పంపాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు సుధాకర్‌బాబు, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దిలిప్ దోకా, ఆదోని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవిశెట్టి, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు నీలకంఠప్ప, లక్ష్మీనారాయణ రెడ్డి, విల్సన్, దామోదరం రాధాకృష్ణ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రమిల, సేవాదళ్ అధ్యక్షురాలు అనంతవెంకట సుజాత తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు రోడ్‌షోలో ప్రజలకు షర్మిల అభివాదం

డీఎస్సీ ఎప్పుడు..?

- నాలుగున్నరేళ్లుగా అభ్యర్థుల ఎదురుచూపు
- గత ఏడాది జూన్, ఆగస్టులో అన్నారు
- నవంబరులో ప్రకటిస్తామని బుకాయింపు
- సంక్రాంతి తర్వాత అని మంత్రి ప్రకటన
- నేటికీ ఆ ఊసే ఎత్తని ప్రభుత్వం
- సర్కారు తీరుపై అభ్యర్థుల ఆగ్రహం



నంద్యాలలోని ఓ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు



నంద్యాల (నూనెపల్లె), జనవరి 29: **డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు గత ఏడాది జూన్‌లో నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. జూన్‌లో ప్రకటన విడుదల చేయకపోవడంతో ఆగస్టులో ప్రకటిస్తామని తర్వాత నవంబరులో ఇస్తామని మంత్రి పలుమార్లు కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 సంక్రాంతి సెలవుల అనంతరం వారంలో మెగా డీఎస్సీని విడుదల చేస్తామని మళ్లీ మంత్రి పేర్కొన్నారు.**

నిరుద్యోగులకు డీఎస్సీ ప్రకటన కలగానే మిగిలిపోయింది. ప్రభుత్వ హామీలు నమ్మి నాలుగున్నరేళ్లుగా ఎదురుచూసి విసిగిపోయారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో నోటిఫికేషన్‌పై ఆశలు సన్నగిల్లుతున్నాయి. చివరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ గళం వినిపించేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. 2019 నుంచి ఇప్పటివరకు అభ్యర్థులకు ఎలాంటి డీఎస్సీ ఇవ్వకుండా తాత్సారం చేయడంపై అభ్యర్థులు వేలకు వేలు డబ్బులు ఖర్చు పెట్టుకొని శిక్షణ తీసుకొని సమయాన్ని వృథా చేసుకోవాల్సి వచ్చిందని వాపోతున్నారు.

ఖాళీలకు భారీగా గండి

వైసీపీ ప్రభుత్వంలో పాఠశాలల విలీనం హేతుబద్ధీకరణతో డీఎస్సీలో పోస్టులు ఖాళీలకు భారీగా గండి పడింది. 2021-2022, 2022-2023 విద్యాసంవత్సరాల్లో పాఠశాలల విలీనం, హేతుబద్ధీకరణ తర్వాత ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినా ఇంకా మిగులులో ఉన్నారు. 1నుంచి 3కి.మీ. పరిధిలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సమీప ఉన్నత పాఠశాలల్లో కలిపారు. ప్రాథమికంలో విద్యార్థుల సంఖ్య, ఏకమాధ్యమం, ఉన్నత పాఠశాలల్లో సెక్షన్లను కొలమానంగా తీసుకోవడంతో ఎస్జీటీ ఖాళీలు మిగులుగా గుర్తించారు.

నూతన విద్యావిధానం అమలుతో పోస్టులకు కోత

దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని నూతన విద్యావిధానం ఏపీలో మాత్రమే సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేయడంపై 117జీవోతో ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎస్జీటీ పోస్టులకు భారీగా కోత పడింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ఈ సమస్య తలెత్తింది. జీవోను రద్దు చేయాలని, నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు మొరపెట్టుకున్నా ప్రభుత్వం దాన్ని పెడచెవిన పెట్టింది. పాఠశాలల విలీనం, హేతుబద్ధీకరణతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీల్లో 1600, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 70తోపాటు ఎస్జీటీలో కన్నడం 30, ఉర్దూ 79 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితోపాటు ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను ఎంఈవో, ఎంఈవో-2 పోస్టులలో భర్తీ చేయగా వీరి స్థానాలలో, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో ఎస్జీటీలుగా ఉండి అర్హత ఉన్న ఉపాధ్యాయులను పదోన్నతులలో స్కూల్ అసిస్టెంట్లుగా భర్తీ చేయడంతో ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీల సంఖ్య గణనీయంగా తగ్గింది.



రెండు ప్రభుత్వాల్లో తేడాను గమనిస్తే

- టీడీపీ అయిదేళ్ల పాలనలో రెండు డీఎస్సీలు నిర్వహించింది. 2014లో, 2018లో పోస్టులకు ప్రకటనలు వెలువడ్డాయి. న్యాయస్థానం కేసుల కారణంగా 2018లో ప్రకటించిన పోస్టులనే ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం భర్తీ చేసింది.
- వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో డీఎస్సీ ద్వారా ఒక్క ఉపాధ్యాయ పోస్టును భర్తీ చేయలేదు. 2008, 1998 డీఎస్సీ అభ్యర్థులను కనీస వేతన స్కేల్‌పై నియమించింది.
- కొత్త డీఎస్సీ కోసం 2020లో ప్రతిపాదనలు కోరినా కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులకు విద్యాశాఖ ప్రతిపాదనలు పంపింది.
- 2022 ఆగస్టులో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించారు. తర్వాత డీఎస్సీ ప్రకటన ఇప్పటి వరకు వెలువడలేదు.
- 2023 జూలై, ఆగస్టు, నవంబరులో డీఎస్సీ నిర్వహిస్తామని 2024లో సంక్రాంతి సెలవుల తర్వాత వారం రోజుల్లో డీఎస్సీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు.

మళ్లీ టెట్ ప్రకటన అనడంపై మండిపాటు

డీఎస్సీ పరీక్ష రాయాలంటే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో అర్హత సాధించాలి. ఈ క్రమంలో ప్రభుత్వం 2022 ఆగస్టులో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించింది. అప్పట్నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన పాపానపోలేదు. ఎన్నికల నేపథ్యంలో గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు డీఎస్సీ ప్రకటనపై మంత్రి బొత్స సత్యనారాయణ అదిగో.. ఇదిగో అనడమే తప్ప ప్రకటన వెలువరించలేదు. డీఎస్సీకి సీఎం జగన్మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని చెబుతున్నప్పటికీ ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం లేదు. సంక్రాంతి సెలవుల తర్వాత వారం రోజుల్లో కచ్చితంగా 6 వేల నుంచి 10 వేల లోపు డీఎస్సీ ప్రకటిస్తామని బొత్స చెప్పినప్పటికీ ఇప్పుడు డీఎస్సీ అభ్యర్థులకు శుభవార్త అంటూ మళ్లీ టెట్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొనడంపై అభ్యర్థుల్లో అనుమానం, కోపావేశాలు రేకెత్తుతున్నాయి. డీఎస్సీ ఇవ్వకుండా మళ్లీ టెట్ ఏంటని అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. టెట్ ప్రకటించినా దరఖాస్తు చేసుకునేందుకు 15 రోజులు, పరీక్షకు సిద్ధపడేందుకు నెల రోజులు, అనంతరం పది రోజుల్లో ఫలితాలు వెల్లడించేందుకు నోటిఫికేషన్‌లో ప్రకటించినా ఎన్నికల నేపథ్యంలో ఇక డీఎస్సీని మరచిపోవాల్సిందేనని అభ్యర్థులు భావిస్తున్నారు.

ప్రభుత్వంపై అభ్యర్థుల ఆగ్రహం

నాలుగున్నరేళ్లుగా డీఎస్సీ విడుదల చేయకపోవడంపై అభ్యర్థుల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. పలుమార్లు ప్రకటించినా కార్యరూపం దాల్చకపోవడంపై మండిపడుతున్నారు. డీఎస్సీనే నమ్ముకున్న అభ్యర్థులు ఏ ప్రైవేట్ రంగంలోకి ఉద్యోగాలకై వెళ్లకుండా వ్యయప్రయాసలతో కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతూ డీఎస్సీ కోసం కళ్లు కాయలుకాచే విధంగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ వైఖరిపట్ల అభ్యర్థులు పెదవి విరుస్తున్నారు. ఎన్నికల సమయంలో కంటితుడుపు చర్యగా అరకొర పోస్టులతో డీఎస్సీని ప్రకటించినా అవి జరిగేవని కాదని భావిస్తున్నారు.

అల్లాబకాష్ చిరస్మరణీయ రంగస్థల నటుడు

కళాకారుల ఘన నివాళి



అల్లాబకాష్(ఫైల్)

కర్నూలు(కల్చరల్), జనవరి 29: సత్య హరిశ్చంద్ర పద్య నాటకానికి ఉమ్మడి రాష్ట్రంలో కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చిన నటుడు లొద్దిపల్లి అల్లాబకాష్ అని, కళకు మతం, కులం లేవని ఆయన నిరూపించారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కొనియాడారు. ప్రముఖ సీనియర్ రంగస్థల నటుడు, ఎన్టీయార్ స్మారక పురస్కార గ్రహీత లొద్దిపల్లి అల్లాబకాష్ (93) సోమవారం ఉదయం కర్నూలులోని ఆయన స్వగృహంలో వయోభారంతో కన్నుమూశారు. పలువురు రంగస్థల కళాకారులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళా క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ జిల్లా నాటక రంగ ఖ్యాతిని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో చాటి చెప్పిన అల్లాబకాష్ చిరస్మరణీయ రంగస్థల నటుడని కొనియాడారు. అల్లాబకాష్ 1932లో లొద్దిపల్లిలో జన్మించారని, దివంగత సంగీత దర్శకుడు నందుల ఆంజనేయులు పర్యవేక్షణలో ఆయన ఇతర రాష్ట్రాల్లో అనేక నాటకాలు ప్రదర్శించారని గుర్తు చేసుకున్నారు. 1985లో నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీయార్ చేతుల మీదుగా పురస్కారంతోపాటు 2008లో ఎన్టీయార్ పురస్కారాన్ని అందుకున్న గొప్ప నటుడని అన్నారు. గజల్ గాయకుడు మహ్మద్ మియా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వంటివారంతా అల్లాబకాష్ నటనకు పులకించారని చెప్పారు. అల్లాబకాష్ నాటకాన్ని చూసేందుకు ఎద్దుల బండ్లు కట్టుకొని వచ్చేవారని కళావాహిని సాంస్కృతిక, సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. మనోహర్‌బాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగస్థల కళాకారులు కళాప్రియ తిరుపాలు, శ్రీనివాసరెడ్డి, ఆవులయ్య, భాస్కర్ యాదవ్, ఆనందరావు, ధనుంజయ, జయరాముడు తమ సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రపుశాల అంకయ్య, జిల్లా కళాకారుల సేవా కేంద్రం అధ్యక్షుడు బైలుప్పల షఫీయుల్లా, హనుమాన్ కళా సమితి అధ్యక్షుడు పి. హనుమంతరావులు ఆయనకు నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి, జనవరి 29: పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కిరణ్ కుమార్(26) మృతి చెందాడు. గుత్తికి చెందిన కిరణ్ కుమార్, స్నేహితుడు మల్లేష్‌తో కలసి దైవ దర్శనం కోసం యాగంటికి మోటారు బైకుపై బయలుదేరారు. ప్యాపిలి సమీపంలోని బనగానపల్లి క్రాస్‌రోడ్డు దగ్గరకు రాగానే ప్రమాదవశాత్తు బైకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కిరణ్‌కుమార్‌కు బలమైన గాయాలు కాగా అక్కడి కక్కడే మృతి చెందగా మల్లేష్‌కు తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. బాధితుడిని డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం : సీఐడీ సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐడీ సీఐ దస్తగిరి

కోడుమూరు, జనవరి 29: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సీఐడీ సీఐ దస్తగిరి అన్నారు. స్థానిక స్నేహ కళ్యాణ మండపంలో సీఐడీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్సీ, ఎస్టీ యాక్ట్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. కుల మత బేధాలు లేకుండా ప్రతి గ్రామంలో కలిసిమెలిసి జీవించాలన్నారు. ప్రజల రక్షణ కోసం చట్టాలు తీసుకొచ్చారని, చట్టాలు ఉన్నంత వరకు బీఆర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరి గుండెల్లో ఉంటాడని కొనియాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని అసమానతలను రూపు మాపాలని ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు, సీఐడీ ఎస్ఐ శ్రీనివాసులు, కుల, ప్రజా సంఘాల నాయకులు మునుస్వామి, నాగేష్, గఫూర్‌మియా, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై గొడ్డలితో దాడి

కోవెలకుంట్ల, జనవరి 29: కోవెలకుంట్ల మండలంలోని బిజనవేముల గ్రామానికి చెందిన బాలమ్మ అనే మహిళపై అదే గ్రామానికి చెందిన గజ్జల దస్తగిరి గొడ్డలితో దాడి చేసి గాయపరిచాడు. ఈ సంఘటన సోమవారం జరిగింది. గజ్జల హుసేనయ్య స్థలంలో బాలమ్మ గేదెలు కట్టేసుకొనేది. ఈ విషయంలో హుసేనయ్య కూతురుతో ఆమెకు చిన్న గొడవ జరిగింది. దీనిపై గజ్జల హుసేనయ్య ఆమె ఇంటి వద్దకు వచ్చి గొడవపెట్టుకొని గొడ్డలితో నరికాడు. దీంతో ఆమె ఛాతీ కింద గాయాయ్యాయి. బాలమ్మకు కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించారు. బాలమ్మ ఫిర్యాదు మేరకు గజ్జల హుసేనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

వైసీపీకి షాక్..

- టీడీపీలో చేరిన జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్
- అధినేత చంద్రబాబు సమక్షంలో చేరిక



టీడీపీ అధినేత చంద్రబాబు, బీటీ నాయుడు, తిక్కారెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సురేష్

కోసిగి, జనవరి 29: మంత్రాలయం నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ప్రధాన అనుచరుడు, ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ వైసీపీని వీడి మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం చంద్రబాబు సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. టీడీపీలో చేరిన సురేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసీపీ జెండా మోసిన వారికి విలువ లేదని, అధికారంలోకి రాక ముందు పార్టీ కోసం పని చేయించుకుని అధికారంలోకి వచ్చాక కార్యకర్తలను, నాయకులను వాడుకుని వదిలేశారని అన్నారు. వైసీపీలో సముచిత స్థానం లేకపోవడంతో మనోభావాలు దెబ్బతిన్నాయని, దీంతో టీడీపీలో చేరామని సురేష్ తెలిపారు. గతంలో వైసీపీ కోసం పని చేసిన వాళ్లను పక్కన పెట్టి, డబ్బులు ఇచ్చేవారికి పనులు చేస్తున్నారని అన్నారు. సురేష్ 2019 ఎన్నికల్లో కోసిగి మండలంతో పాటు నియోజకవర్గంలోని రాజకీయాల్లో కీలకంగా ఉన్న వ్యక్తులను వైసీపీ గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశాడు. అయితే సురేష్‌లో టీడీపీలో చేరడంతో వైసీపీ శ్రేణుల్లో వణుకు మొదలైంది.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించండి



కర్నూలు (కలెక్టరేట్), జనవరి 29 : జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ జి. సృజన అధికా రులను ఆదేశించారు. సోమవారం ఈఆర్‌ఓ, ఆర్డీఓ, తహసీల్దార్లు, ఎస్ఈ లతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 23 నుంచి తుది ఓటర్ల జాబితాపై పత్రికల్లో వచ్చిన ప్రతి వ్యతిరేక వార్తను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు పంపాలని ఈఆర్‌ఓలను ఆదేశిం చారు. సెక్టార్ ఆఫీసర్లు అన్ని పోలింగ్ స్టేషన్‌లు తనిఖీ చేయాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్ఐలు బదిలీ

కర్నూలు, జనవరి 29: జిల్లాలో ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ జి.కృష్ణకాంత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్పరి ఎస్ఐ వరప్రసాద్‌ను కోవెలకుంట్లకు బదిలీ చేశారు. అలాగే దేవనకొండ ఎస్ఐ భూపాలుడును వెలుగోడు పీఎస్‌కు బదిలీ చేశారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.84 కోట్లు

మంత్రాలయం, జనవరి 29: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం జనవరి నెల 33 రోజుల హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించడం ప్రారంభించినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. మొదటిరోజు లెక్కింపు పూర్తి కాగా రూ.3,83,70,000 నగదు వచ్చినట్లు తెలిపారు. 2023 డిసెంబరు 27వ తేదీ నుంచి 2024 జనవరి 29వ తేదీ వరకు 33 రోజుల హుండీని గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య లెక్కించినట్లు తెలిపారు. మంగళవారం నాణేలు, వెండి, బంగారు, వివిధ దేశాల డాలర్లు లెక్కించాల్సి ఉందని చెప్పారు.

ఉమ్రా యాత్రలో చాగలమర్రి వాసి మృతి

చాగలమర్రి, జనవరి 29: చాగలమర్రి గ్రామానికి చెందిన జంగాలపల్లె చాంద్‌బాషా(58) ఉమ్రా యాత్రకు వెళ్లి సోమవారం మృతి చెందాడు. చాంద్‌బాషా తన భార్య మాబుచాన్‌లతో పాటు కడప జిల్లాకు చెందిన మరో 25 మందితో ఆదివారం ఉమ్రా యాత్రకు హైదరాబాదు నుంచి విమానంలో సౌది అరేబియాకు వెళ్లాడు. మక్కాలో నమాజు చేసుకునేందుకు సిద్ధం కావడానికి రూముకు వెళ్లగానే గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చాంద్‌బాషా అంత్యక్రియలను సౌదిలోనే జరుపుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషాతో పాటు టీడీపీ నాయకులు సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పంచలింగాలను సందర్శించిన తెలంగాణ ఆర్టీసీ ఎండీ

కర్నూలు, జనవరి 29: కర్నూలు మండలం పంచలింగాలలో ఉన్న శివాలయాన్ని తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోమవారం సందర్శించారు. ముందుగా బెటాలియన్ గెస్టుహౌస్‌కు చేరుకున్న ఆయన కాసేపు సేద తీరి అనంతరం శివాలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. శివాలయం వచ్చిన ఈయనకు ఆలయ పూజారులు, సీఐ శ్రీరాములు, ఎస్ఐ సమీర్‌లు ఘనస్వాగతం పలికారు. సజ్జనార్ ఆలయంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

పకడ్బందీగా ప్రాక్టికల్స్ నిర్వహించాలి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 29 : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ మధుసూదన్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 5వ తేది నుంచి ఒకేషనల్ విద్యార్థులకు, 11 వ తేది నుంచిజనరల్ విద్యార్థులకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలపారు. కార్యక్రమంలో ఆర్‌ఐఓ గురువయ్య శెట్టి, డీవీఈఓ జమీర్‌బాష, లాలప్ప పాల్గొన్నారు.

నేటి నుంచి కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 29: జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు గాంధీ మహాత్ముని వర్ధంతి సందర్భంగా జిల్లాలో జరిగే కుష్ఠు వ్యాధి అవగాహన పక్షోత్సవాలను విజయవంతం చేయాలని కర్నూలు కలెక్టర్ డా.జి.సృజన పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పక్షోత్సవాల పోస్టర్‌ను జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్‌రావు, డీఎంహెచ్‌వో రామగిడ్డయ్య, అడిషినల్ డీఎంహెచ్‌వో భాస్కర్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి అనేది మైక్రో బ్యాక్టీరియా లెప్రి అనే సూక్ష్మ క్రిమి వల్ల వస్తుందని, ఈ వ్యాధిని త్వరగా గుర్తించి నిర్మూలిస్తే ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాపించకుండా అరికట్ట వచ్చునన్నారు. చర్మలపై స్పర్శలేని మచ్చలు, నరాలు వాపు, జోములు, కాళ్లకు చెప్పులు జారిపోవడం వంటి లక్షణాలు ఉన్న ఎడల ఆరోగ్య కేంద్రంలో ఉన్న వైద్యున్ని సంప్రదించాలన్నారు. కుష్ఠు వ్యాధికి ఎండీటీ మందులు పూర్తిగా ఉచితంగా పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎంవో మల్లికార్జున, హెచ్‌ఈవో శివశంకర్‌రావు, డీపీఎంవో హక్ పాల్గొన్నారు.



కుష్ఠు వ్యాధి పక్షోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, డీఎంహెచ్‌వో

నేడు సీక్యాంపు రైతుబజారు బంద్

-ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 29: కర్నూలు నగరంలోని సీ క్యాంపు రైతుబజారులో మంగళవారం కూరగాయల విక్రయాలు జరగవని ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్ తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచే కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా రైతులు కూరగాయలను మంగళవారం సీ క్యాంపు రైతుబజారుకు తీసుకు రావద్దని అన్నారు. అదేవిధంగా వినియోగదారులు కూడా కూరగాయలను కొనడానికి రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

అలాంటి పండ్లను విక్రయానికి తేవద్దు

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 29: మార్కెట్‌లో కొంత మంది వ్యాపారులు కాల్షియం కార్బైడ్‌తో మాగబెట్టిన పండ్లను సీ క్యాంపు రైతుబజారుకు తీసుకురావద్దని ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని సీ క్యాంపు రైతుబజార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అరటి, మామిడి, బొప్పాయి, యాపిల్, సపోట వంటి వివిధ రకాల పండ్లను కృత్రిమంగా కాల్షియం కార్బైడ్ ద్వారా మాగబెట్టి వినియోగదారులకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ విధంగా క్యాల్షియం కార్బైడ్ ద్వారా మాగబెట్టిన పండ్లను తిన్న వారికి క్యాన్సర్, అల్సర్, కాలేయం, మూత్ర పిండాలు నాడి సంబంధిత వ్యాధులతోపాటు కళ్ల మంటలు, వాంతులు డయేరియా అదేవిధంగా గర్భస్రావ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా అరటి, మామిడి పండ్లను ఇథలిన్ గ్యాస్ ద్వారా మాగబెట్టు గదులు ఏర్పాటు చేసుకోవడానికి 40 శాతం రాయితీ అందిస్తోందని, ఈ అవకాశాన్ని వ్యాపారులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి: టీడీపీ

గోస్పాడు, జనవరి 29: ప్రజా ఆస్తులంటే వైసీపీ ప్రభుత్వానికి, ఆ పార్టీ నాయకులకు చులకన భావం ఉందని, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేందుకు ఎంతటికైనా తెగబడుతుండటం దుర్మార్గమని, వాటిని కాపాడాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యా ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ కోరారు. మండలంలోని పసురుపాడులో గ్రామ వైసీపీ నాయకులు రాత్రికి రాత్రే ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన చెత్త సంపద సృష్టి కేంద్రం షెడ్డును నేలమట్టం చేసిన ఘటన తెలుసుకొని ఆ ప్రాంతాన్ని సోమవారం టీడీపీ నాయకులు పరిశీలించారు. ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు గ్రామ వైసీపీ నాయకులు చేసిన దౌర్జన్య కాండపై కనీసం ప్రభుత్వ అధికార యంత్రాంగం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోవడం దారుణమన్నారు. వైసీపీ అధినేత, సీఎం జగన్ సైకోను తలపిస్తూ రాష్ట్రంలో అరాచక, దౌర్జన్యకర పాలన సాగిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను విమర్శించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తూ రాక్షస ఆనందం పొందుతున్నారని అన్నారు. వారి అధినాయకుడిని ఆదర్శంగా తీసుకొని గ్రామ స్థాయి వైసీపీ నాయకులు కూడా విచ్చల విడిగా రెచ్చిపోతున్నారని మండి పడ్డారు. 8 షెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు వైసీపీ నాయకులు ప్రభుత్వం నిర్మించిన షెడ్డును కూల్చి వేస్తే కనీసం ఈ ప్రాంతాన్ని అధికారులు పరిశీలించకపోవడం దారుణమన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం వెనుక వైసీపీ నాయకులకు అధికారులు తొత్తులుగా వ్యవహరించడమే కారణమని, ఇప్పటికైనా ప్రజా ఆస్తుల పరిరక్షణలో రాజకీయాలకు అతీతంగా అధికార యంత్రాంగం నడుచుకోవాలని అన్నారు. షెడ్డు కూల్చివేతకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయించి వారి నుంచి ఆస్తి నష్టానికి పరిహారం రాబట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై గోస్పాడు మండల అధికారులు స్పందించకుంటే జిల్లా అధికారుల దృష్టికి తామే తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


నేలమట్టమైన షెడ్డు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

జగన్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధం: ఫరూక్


నంద్యాలలో మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తున్న ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 29: రాష్ట్రంలో సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాలలోని 1వ వార్డులో సోమవారం బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫరూక్‌తోపాటు రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రరావు, తాతిరెడ్డి తులసిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, పట్టణ అధ్యక్షుడు మణియార్ ఖలీల్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బృందావన గోశాలకు విరాళం


గోశాల నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న అభిరుచి మధు

నంద్యాల (కల్చరల్), జనవరి 29: బీజేపీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్ అభిరుచి మధు సోమవారం బృందావన గోశాలకు లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు. గోశాలకు అవసరమైన వనరుల కోసం నిర్వాహకుడు బసవరాజుకు విరాళాన్ని అందజేశారు. బీజేపీ నంద్యాల పట్టణ అధ్యక్షుడు కొట్టె చంద్రశేఖర్, లక్ష్మీరెడ్డి, ఉపేంద్రనాథ్‌రెడ్డి, సాయిరాం, సుదర్శన్ రెడ్డి, కేతేపల్లె చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంపై కేబినెట్‌లో చర్చించాలి'


కొత్తపల్లిలో ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

కొత్తపల్లి, జనవరి 29: గత ఎన్నికల ముందు సీఎం జగన్ వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను బుధవారం జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కారం చూపాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్, ప్రధాన కార్యదర్శి భూపాల్, సీపీఎం నాయకులు నక్కస్వాములు డిమాండ్ చేశారు. సోమవారం వారు కొత్తపల్లి మండలంలోని ఆయా గ్రామాల వీఆర్ఏలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ధర్నా చేశారు. వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు రవి, వీఆర్ఏలు సలామియా, మియాసాబ్, అమ్మన్ని, ముర్తుజా, విజయుడు, నాగేశ్వరరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, జనవరి 29: నంద్యాల జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయాన్ని ఎస్పీ రఘువీర్‌రెడ్డి వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఏఆర్ పోలీసుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవని అన్నారు. విధులతో పాటు ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వెంకట రాముడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, డీఎస్పీ రంగముని, రిజర్వుడు ఇన్‌స్పెక్టర్లు సుధాకర్, శ్రీనివాసులు, మంజునాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి: డీఆర్వో


వినతులను స్వీకరిస్తున్న డీఆర్వో పుల్లయ్య

నంద్యాల (కల్చరల్), జనవరి 29: ప్రజా వినతులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా రెవిన్యూ అధికారి పుల్లయ్య అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. 187 మంది అర్జీలు సమర్పించారు.

మున్సిపాలిటీ బడ్జెట్ ప్రణాళికకు ఆమోదం

ఆత్మకూరు, జనవరి 29: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రణాళికకు సోమవారం కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. స్థానిక పట్టణ ప్రణాళిక విభాగం కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాబోయే వివిధ గ్రాంట్‌లు, జనరల్ ఫండ్ కింద సమకూరే నిధులు, ఖర్చులకు సంబంధించిన అంచనాలను ప్రవేశపెట్టారు. సమావేశంలో కమిషనర్ శ్రీనివాసరావుతో పాటు కోఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు ఉన్నారు.

మహానందిలో పల్లకీ సేవ


మహానందిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, జనవరి 29: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి మహానందీశ్వరునికి పల్లకీ ఉత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మంటపంలో స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పల్లకీపై అర్చకులు ఆశీనులు చేశారు. వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

'బీసీలు ఐక్యంగా ముందుకు సాగాలి'


జూపాడుబంగ్లాలో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

జూపాడుబంగ్లా, జనవరి 29: ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న వైసీపీని గద్దెదించేందుకు బీసీలు ఐక్యతతో రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. జూపాడుబంగ్లాలో సోమవారం జయహో బీసీ కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్ అధ్యక్షతన జరిగింది. ముందుగా నూతనంగా జూపాడుబంగ్లాలో టీడీపీ కార్యాలయం ప్రారంభించారు. తిరుపాలు, శ్రీరాములు, శ్రీనివాసులు మాట్లాడారు. బీసీలకు టీడీపీలోనే సముచిత న్యాయం జరిగిందన్నారు. మాండ్ర, గౌరు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వైసీపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. నాయకులు జయసూర్య, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, గిరీశ్వరరెడ్డి, పిక్కిలి శ్రీనివాసులు, రమణారెడ్డి, రామోహ్మన్‌రెడ్డి, రవికాంత్, రాముడు, అశోక్‌రెడ్డి, సుధాకర్, రవికుమార్‌యాదవ్, కృష్ణయ్య, బాబు, శాలుబాషా, మహేష్‌నాయుడు, గోరేసాహెబ్, ఉస్మాన్‌బాషా, ఖాజీకురైషన్, ఉసేనయ్య, సోమేశ్వరగౌడు, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

జూపాడుబంగ్లాలో సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జయహోబీసీ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హ జరైన టీడీపీ మాండ్ర, గౌరు సమక్షంలో జూపాడుబంగ్లాకు చెందిన ఎంపీటీసీ వెంకటమ్మ, వైసీపీ పార్టీ నాయకులు జంగాలపెద్దన్న ఆధ్వర్యంలో సుమారు 500 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నందికొట్కూరు రూరల్: మండలంలోని అల్లూరు గ్రామంలో టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో సోమవారం నందికొట్కూరు పట్టణ వైసీపీ నాయకులు సమక్షంలో టీడీపీలో చేరారు. భూపన శ్రీకాంత్, భూపన ప్రవీణ్, తిమ్మారెడ్డి, ఖాదర్ ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలోని కొంత మంది వైసీపీ నాయకులు, యువకులు టీడీపీలో చేరారు. వీరికి మాండ్ర శివానందరెడ్డి కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. వేణుగోపాల్, రాజు, అఖిల్, రియాజ్, రంగస్వామి, అశోక్, శ్రీకాంత్, ప్రీను ప్రకాష్, షేక్షా, మహబూబ్ బాషా, అజయ్, ఖలీల్, సులేమాన్, రాఘవేంద్ర, ప్రేమ్ దాసు, మాబాషా, ముక్తియార్, ఫయాజ్, అరుణ్, నవీన్, ఫరూక్, అబ్దుల్లా, అలాం, మహబూబ్ తదితరులు టీడీపీలో చేరారు. నాయకులు మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, జయసూర్య, జమీల్, మహేశ్వరెడ్డి, జయసూర్య పాల్గొన్నారు.


అల్లూరులో మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరుతున్న నందికొట్కూరు పట్టణ వైసీపీ నాయకులు

నందికొట్కూరు: పట్టణంలోని షికారి పేటలో బళ్లారి దుర్గమ్మ గుడి నిర్మాణానికి టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, ముర్తుజావలి, షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'



మాట్లాడుతున్న టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి లాయర్ బాబు

గడివేముల, జనవరి 29: వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ స్టేట్ లీగల్‌సెల్ సెక్రెటరీ లాయర్ బాబు టీడీపీ బూత్ ఇన్‌చార్జిలు, కుటుంబ సాధికార సారథులు, ఐటీడీపీ కార్యకర్తలకు సూచించారు. గడివేములలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వారికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. లాయర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంద, రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. నిత్యావసర ధరలు ఆకాశన్నంటాయన్నారు. అక్రమంగా కేసులు బనాయించి టీడీపీ నాయకులను, కార్యకర్తలను వేధిస్తున్నారని అన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయబోయే పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సోషల్ మీడియాలో వైసీపీ చేస్తున్న అసత్య ఆరోపణలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలోని తప్పులను, దొంగ ఓట్లను గుర్తించాలన్నారు. నాయకులు ఈశ్వర్‌రెడ్డి, ఎస్ఏ రఫిక్, వడ్డు లక్ష్మీదేవి, రమణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఐటీడీపీ నాయకులు రాజు, బాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్ష

పాణ్యం, జనవరి 29: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షలో ఉదయం 156 మంది అభ్యర్థులకు 154 మంది హాజరైనట్లు పరీక్షల కన్వీనర్ డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. సాయంత్రం 155 మంది అభ్యర్థులకు 154 మంది హాజరైనట్లు తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

'దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి'

ఆత్మకూరు, జనవరి 29: ఆత్మకూరు పట్టణంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు రణధీర్ కోరారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే కుక్కల బెడద నియంత్రణకు చొరవ తీసుకోవాలని కోరారు. నాయకులు ఇస్మాయిల్, సురేంద్ర, దినేష్ తదితరులు ఉన్నారు.

నంద్యాల (నూనెపల్లె): నంద్యాల పట్టణంలోని అన్ని వీధుల్లో దోమలు అధికంగా ఉండి ప్రజలకు ఇబ్బందికరంగా మారాయని దోమల నుంచి కాపాడాలని ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక కన్వీనర్ అబులైస్, కో కన్వీనర్ షేక్ మస్తాన్‌లు డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలోని అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటదాసుకు వినతి పత్రం అందజేశారు. మౌలానా రహంతుల్లా, కిరణ్, జబ్బార్ తదితరులు ఉన్నారు. నంద్యాల పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండి రఫీ డిమాండ్ చేశారు. అపరిశుభ్రతను, డ్రైనేజీల్లో పూడికతీయడంతోపాటు ఫాగింగ్ చేయాలని డిమాండ్ చేశారు.

'రోడ్డు భద్రత నియమాలు అతిక్రమిస్తే చర్యలు'

పాములపాడు, జనవరి 29: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ అశోక్ తెలిపారు. సోమవారం పాములపాడు కేజీ రోడ్డుపై వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులు సరైన వాహన పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

శాంతిరాంలో ప్రాంగణం ఎంపికలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

పాణ్యం, జనవరి 29: మండలంలోని శాంతిరాం ఫార్మసీ కళాశాలలో సోమవారం జరిగిన ప్రాంగణ నియామకాల ఎంపికలో 24 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి తెలిపారు. మెడి అసిస్ట్ ఇన్సూరెన్స్ కంపెనీ నిర్వహించిన నియామకాల ఎంపికలో ఫైనల్ ఇయర్ బీ ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించారు.

'టీడీపీ మేనిఫెస్టోపై అవగాహన కల్పించాలి'


సమావేశంలో మాట్లాడుతున్న ఇంటిగ్రేటెడ్ ట్రైనర్

పాణ్యం, జనవరి 29: టీడీపీ మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత బూత్ ఇన్‌చార్జిలదేనని మేనిఫెస్టో ఇంటిగ్రేటెడ్ ట్రైనర్ సద్దాం అన్నారు. పాణ్యంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ బూత్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, క్లస్టర్లకు మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు. తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, దీపం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, రైతులకు అన్నదాత, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి తాగునీరు, పూర్ టు రిచ్ వంటి అంశాలపై అవగాహ న కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గణపం జయరామి రెడ్డి, రామోహ్మన్‌నాయుడు, కేశవులు, మండల నాయకులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే బీసీల సంక్షేమం'


సంతజూటూరులో బీసీలను చైతన్యం చేస్తున్న నాయకులు

బండిఆత్మకూరు, జనవరి 29: టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల సురేష్‌రెడ్డి, మండల యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు, సర్పంచ్ ఎలగల రామచంద్రుడు, లాయర్ కృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని సంతజూటూరు, పరమటూరు గ్రామాల్లో బీసీల ఆత్మీయ కలయిక సోమవారం రాత్రి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన బండిఆత్మకూరులో ఫిబ్రవరి 1న నిర్వహించే జయహో బీసీ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు తిరుపాల్, మహేశ్వరరెడ్డి, శేఖర్, పక్కీర్‌రెడ్డి, మహేశ్‌తారక్, రామకృష్ణ, చిన్నస్వామి, బ్రహ్మానందరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'విజయవంతం చేయాలి'


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, జనవరి 29: ఆత్మకూరు పట్టణంలో ఫిబ్రవరి 3వ తేదీన జరిగే జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని 14, 15 వార్డుల్లో జయహో బీసీ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం బీసీలను చైతన్యం చేశారు. వారు మాట్లాడుతూ టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమన్నారు. సదస్సుకు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో పాటు జిల్లా నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 3వ తేది సాయంత్రం 4గంటలకు పట్టణంలోని వెంగళరెడ్డినగర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నాగూర్ ఖాన్, బీసీ విభాగం నాయకులు ఆర్బీసీ రామకృష్ణ, ఇరగదిండ్ల మురళీ, నగేష్ యాదవ్, మాయలూరి రమణ సుబ్బ రావు, తెలుగు శ్రీనివాసులు, ఉప్పరి శివ, శ్రీనివాసులుయాదవ్ ఉన్నారు.

'హామీలు నెరవేర్చాలి'

నంద్యాల (నూనెపల్లె), జనవరి 29: ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎస్టీయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు సోమేసుల చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఇక్బాల్‌బాషా డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాలలోని నేషనల్ కళాశాలలో ఎస్టీయూ నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డీఎస్సీని ప్రకటించి పదోన్న తులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజాంబేగ్, మౌలాలి, శివప్రసాద్, నాగేంద్రకుమార్, రమణ పాల్గొన్నారు.

నేడు కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన

నంద్యాల (కల్చరల్), జనవరి 29: మహాత్మాగాంధీ కుష్ఠు వ్యాధిగ్రస్తులకు చేసిన సేవలకు గాను జనవరి 30న స్పర్శ్ లెప్రసీ అవేర్‌నెస్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డా.వెంకటరమణ తెలిపారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వతేదీ వరకు ప్రభుత్వం కుష్ఠు నివారణకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్వో పుల్లయ్య తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్వో పుల్లయ్య, డాక్టర్ శారదాబాయిలు కుష్ఠు నివారణపై అవగాహన పోస్టర్లను డాక్టర్ కాంతా నాయక్, విజయ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.300 ఎందుకు చెల్లించాలి?

- ఆత్మకూరు-నంద్యాల రోడ్డుపై బైఠాయించిన శివస్వాములు


ఆత్మకూరు-నంద్యాల రోడ్డుపై నిరసన చేస్తున్న శివస్వాములు

ఆత్మకూరు, జనవరి 29: నల్లమలలోని రుద్రకోడూరు క్షేత్రానికి భక్తుల నుంచి రూ. 300 చొప్పున వసూలు చేయడం ఏమిటని శివ స్వాములు ధర్నాకు దిగారు. అటవీ అధికారుల తీరును వ్యతిరేకిస్తూ సోమవారం ఆత్మకూరు-నంద్యాల రోడ్డుపై శివస్వాములు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నల్లమలలోని రుద్రకోడూరు క్షేత్రానికి వెళ్లడానికి సాధారణ రోజుల్లో ఆది, సోమవారాలు మాత్రమే అటవీ అధికారులు అనుమతించేవారు. తాజాగా రుద్రకోడూరు క్షేత్రానికి వెళ్లే భక్తులు ఫోర్ వీలర్‌కు రూ.300 పర్యావరణ రుసులు పేరుతో చెల్లించాలనే నిబంధనలు తీసుకొచ్చారు. రుద్రకోడూరు క్షేత్రానికి టూవీలర్ మీద వెళ్లే వాళ్లకు, నడిచి వెళ్లే భక్తులకు అనుమతించమని నిబంధనలు కఠినతరం చేశారు. అయితే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భారీ సంఖ్యలో భక్తులు శివదీక్షను స్వీకరించారు. సోమవారం రుద్రకోటేశ్వరుడ్ని దర్శించు కునేందుకు సుదూర ప్రాంతాల నుంచి బైకులపై తరలివచ్చారు. వారిని క్షేత్రానికి అనుమతించకపోవడం, ఫోర్‌వీలర్ వాహనాలకు రూ.300 వసూళ్ల చేయడంపై శివభక్తులు మండిపడ్డారు. ఆత్మకూరు-నంద్యాల రోడ్డుపై బైఠాయించి అటవీ అధికారుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. రోజుకో నిబంధనలు ప్రవేశపెడుతూ ప్రజల్ని దోచుకుతింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి తాము రుద్రకోడూరు క్షేత్రానికి వెళ్లేవారమని గత కొంతకాలంగా లేనిపోని నిబంధనలు ప్రవేశపెట్టి వేధింపులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా రుద్రకోడూరు క్షేత్రానికి రాకపోకలు చేయించేందుకు ఒక వాహనం అక్కడే ఉంచి భక్తులు నుంచి అధికంగా వసూళ్లు చేస్తున్న వాహనదారుడిపై ఎందుకు అటవీ అధికారులు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. శివభక్తుల నిరసన గురించి తెలుసుకున్న ఆత్మకూరు పోలీసులు అక్కడికి చేరుకుని వారికి సర్ది చెప్పారు. చివరకు రుద్రకోటూరుకు వెళ్లేందుకు అనుమతించడంతో వారు శాంతించారు. ఈవిషయంపై బైర్లూటి రేంజ్ అధికారి సుభాష్‌ను వివరణ కోరగా... నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ ఆదేశాల మేరకే తాము పర్యావరణ రుసుము వసూళ్లు చేస్తున్నామని అన్నారు. మార్చి 10వ తేది వరకు ఆది, సోమవారాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల మధ్యలో వెళ్లేందుకు అనుమతించినట్లు వెల్లడించారు. అయితే భక్తులను తీసుకెళ్లేందుకు అందుబాటులో వుంచిన వాహనం తమది కాదని చెప్పడం గమనార్హం.

దేవస్థానానికి విరాళాలు

శ్రీశైలం, జనవరి 29: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పశ్చిమగోదావరి, భీమవరానికి చెందిన ఎ.రామకృష్ణ రూ.లక్ష విరాళాన్ని, ఖమ్మం జిల్లాకు చెందిన వీవీఎస్ఎస్ శివరామకృష్ణ రూ.లక్ష విరాళాన్ని, రంగారెడ్డి జిల్లాకు చెందిన మారేడుపల్లి నందీశ్వరరెడ్డి రూ.1,11,116 విరాళాన్ని అధికారులకు అందజేశారు. అలాగే గో సంరక్షణ నిధికి సికింద్రాబాద్ రాణి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు చెందిన గల్లా గుండయ్య రూ.5 లక్షలు, చెన్నైకి చెందిన ఎల్. రమేష్‌రెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

- శ్రీశైల దేవస్థానం వైద్యశాలకు సికింద్రాబాద్ రాణి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు చెందిన గల్లా గుండయ్య వైద్యశాలకు బయోకెమిస్ట్రీ అనలైజర్ మిషన్, వివిధ రకాల ఔషధాలను విరాళంగా అందించారు. వీటి విలువ సుమారు రూ.1,63,412 ఉంటుందని దాత తెలిపారు. దాత ఈ విరాళాన్ని దేవస్థానం వసతి విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి ఐఎన్‌వీ మోహన్‌కు అందజేశారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో భూమా బ్రహ్మానందరెడ్డి దంపతులు


ఆలయ ప్రాంగణంలో భూమా బ్రహ్మానందరెడ్డి దంపతులు

శ్రీశైలం, జనవరి 29: శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాం అమ్మ వార్లను సోమవారం నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. భూమా దంపతులు స్వామికి అభిషేకం చేసి భ్రమరాంబికాదేవిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో భూమా దంపతులకు వేద పండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

'సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దు'

నందికొట్కూరు జనవరి 29: పట్టణంలోని 2వ వార్డులో సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దని, ఏర్పాటు చేస్తే ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటామని ఆ వార్డు కౌన్సిలర్ మొల్లా జాకీర్ హుస్సేన్, వార్డు ప్రజలు హెచ్చరించారు. పట్టణంలోని 2వ వార్డులో సోమవారం సెల్ టవర్ నిర్మాణం జరిగే ప్రాంతం వద్ద వార్డు ప్రజలతో కలిసి మొల్లా జాకీర్ హుస్సేన్ సెల్ టవర్ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. అనంతరం కాలనీ వాసులతో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కిషోర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

చెస్ పోటీల్లో ప్రతిభ

నంద్యాల (నూనెపల్లె), జనవరి 29: జిల్లా స్థాయి చెస్ పోటీల్లో గురురాజా స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచి పతకాలు సాధించారని డైరెక్టర్ షేక్షావలిరెడ్డి సోమవారం తెలిపారు. కడపలో జరిగిన చెస్ పోటీల్లో అండర్-15విభాగంలో చరణ్ రెండో స్థానంలో నిలిచాడని చెప్పారు. అలాగే అజిత్ వర్మ, ఫణీంద్ర, రామసురేంద్ర, అశ్వసాకేత్‌రెడ్డి, జగదీష్, శ్రీనిధిలు ప్రశంసాపత్రాలు, పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను షేక్షావలిరెడ్డితోపాటు యాజమాన్యం అభినందించింది.

గిరిజనులు ప్రగతి వైపు సాగాలి: డీఎస్పీ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

ఆత్మకూరురూరల్, జనవరి 29: చెంచు గిరిజనులు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను అందిపుచ్చుకుని ప్రగతి వైపు సాగాలని డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగభూషణ్ సూచించారు. మండలంలోని బైర్లూటి గూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో గిరిజనుల హక్కులు, ఎస్సీ, ఎస్టీ చట్టాల గురించి గిరిజనులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రేఖామణి, హెచ్ఎం యేసు యాదవ్, సర్పంచ్ గురువమ్మ, సీఐడీ ఇన్‌స్పెక్టర్ నగేష్ బాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ బందెసాహెబ్, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పాణ్యం: గిరిజన చట్టాలపై గిరిజనులు అవగాహన కలిగి ఉండాలని సీఐడీ ఉమ్మడి జిల్లాల సీఐ శ్రీధర్ సూచించారు. స్థానిక గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో సోమవారం ఉమ్మడి జిల్లాల సీఐడీ ఆధ్వర్యంలో చెంచులకు గిరిజన తెగల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ నారాయణమ్మ మాట్లాడుతూ చెంచులపై పోలీసుల దాడులను నివారించాలని కోరారు. సర్పంచ్ పల్లవి, ఏఎస్ఐ నరసింహులు, డీటీ మల్లికార్జునరెడ్డి, హెచ్ఎం సునందలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీశైలం: శ్రీశైలం మండలం ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు ఎస్సీ ఎస్టీ యాక్ట్‌పై ఏపీ సీఐడీ కర్నూలు అధికారుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఎస్సీఎస్టీ యాక్ట్ రక్షణ గురించి తెలుసుకుని గిరిజనులు నిర్భయంగా జీవించాలని ఆంధ్రప్రదేశ్ క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచించారు. ముఖ్య అతిథిగా ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ రవీంద్రారెడ్డి, సీఐడీ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, సున్నిపెంట ఎస్ఐ గంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం

- రెండు పాడిగేదెలు, 40 కోళ్లు మృతి
- తీవ్రంగా గాయపడ్డ మూడు ఎద్దులు, నాలుగు గేదెలు



అగ్నిప్రమాదంలో గాయపడిన గేదెలు

రుద్రవరం, జనవరి 29 : మండలంలోని పందిళ్లపల్లె గ్రామంలో సోమవారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసెలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కాణాల చిన్న బాలీశ్వరుడు అనే వ్యక్తికి చెందిన గుడిసెలో ఈ ప్రమాదం జరిగింది. నిద్రావస్థ నుంచి తేరుకుని మంటలు అదుపు చేసే లోపే చెలరేగాయి. ఈ ప్రమాదంలో రెండు పాడిగేదెలు, 40 కోళ్లు మృతి చెందాయి. మూడు ఎద్దులు, నాలుగు పాడిగేదెలు తీవ్ర గాయాలయ్యాయి. జీవనోపాధి కోసం తెచ్చుకున్న పాడిగేదెలు అగ్ని ప్రమాదంలో మృతి చెందడంతో బాలీశ్వరుడు కన్నీరు పెట్టుకున్నాడు. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి మనోరంజన్ ప్రసాద్ గ్రామానికి వెళ్లి గాయపడ్డ ఎద్దులకు, పాడిగేదెలకు వైద్యం అందించారు. బాధితుడికి రూ.3 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. టీడీపీ నాయకుడు ఎర్రం ప్రతాప్‌రెడ్డి, ఎర్రం నర్సిరెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించారు.

'వరిలో కొత్త వంగడాలను ఎంపిక చేసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త సరళమ్మ

శిరివెళ్ల, జనవరి 29: వరి పైరు సాగులో రైతులు కొత్త వంగడాలను ఎంపిక చేసుకోవాలని నంద్యాల ఏరువాక కేంద్రం సమన్వయకర్త, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సరళమ్మ సూచించారు. మండలంలోని యర్రగుంట్లలో సోమవారం రైతు సదస్సు ఏర్పాటు చేశారు. వరి పంటలో వచ్చే ప్రధాన సమస్యలు, వాటి నివారణ మార్గాలను రైతులకు వివరించారు. వ్యవసాయ రంగంలో ప్రస్తుతం రైతులు అవలంబిస్తున్న విధానాలకు సాంకేతికతను జోడించి నూతన పద్ధతులను ఎప్పటికప్పుడు తెలుసుకుని పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న అగ్రికల్చర్ విద్యార్థినులు వివిధ మోడల్స్‌ను ప్రదర్శన నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. మార్క్యాపురం వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీఎస్ రెడ్డి, శిరివెళ్ల వ్యవసాయాధికారి సుధాకర్, సీనియర్ శాస్త్రవేత్త బాలాజీ నాయక్, ప్రొఫెసర్ భార్గవి, సర్పంచ్ అయ్యలూరి సుభహాన్ అలీ పాల్గొన్నారు.

'పది' పరీక్షలపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో న్యామతుల్ల

చాగలమర్రి, జనవరి 29: చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలలో పరీక్షల వారియర్స్‌పై సోమవారం విద్యార్థులకు ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల అవగాహన కల్పించారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన పరీక్షపై చర్చా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరీక్షలు రాసే విధానం గురించి తెలియజేశారు. పరీక్షలు పండుగలు లాంటివని, సంతోషంగా ఉండాలని సూచించారు. జ్ఞానం శాశ్వతమైనదని అన్నారు. సమయం వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఒత్తిడికి లోనవకుండా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ప్రధాని అమలు చేసిన 25 సూత్రాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, హెచ్ఎం కోటయ్య, సీఆర్పీలు అమీర్‌ఖాన్, ఖాశీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అహోబిలేశుడికి ప్రత్యేక పూజలు



ముత్తలూరులో పార్వేట పల్లకిలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం, జనవరి 29: మండలంలోని ముత్తలూరు గ్రామ పొలిమేరలో గ్రామ పెద్దలు మేళతాళాలతో ఎదురేగి పార్వేట పల్లకీకి స్వాగతం పలికారు. పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాద వరద రాజస్వామికి అర్చకుడు కళ్యాణ నిత్య రంగనాథన్ పూజలు ప్రారంభించారు. గ్రామంలో తెలుపువద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో వీఆర్వో హుసేన్, పంచాయతీ కార్యదర్శి పాములేటి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి..



చెన్నకేశవ ఆలయంలో గోవింద మాలధారులు

చాగలమర్రి, జనవరి 29: చాగలమర్రిలోని చెన్నకేశవ ఆలయంలో సోమవారం ధ్వజస్తంభం వద్ద అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దీక్ష చేపట్టిన మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసింహస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. దీక్షాధారులకు భిక్ష కార్యక్రమాన్ని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు ప్రారంభించారు. దీక్షధారులు చేపట్టిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కొండయ్య, గురుస్వామి ప్రసాద్ పాల్గొన్నారు.

తాటిమాను గురప్పస్వామికి..

రుద్రవరం: మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో కొలువుదీరిన తాటిమాను గురప్పస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించారు.

జగన్‌ను ఇంటికి పంపేద్దాం: బీసీ

అవుకు, జనవరి 29: సీఎం జగన్‌ను ఓడించేందుకు ఏపీ ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం అవుకు మండలం చెర్లోపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు ఐవీఫక్కీర్‌రెడ్డి, ఉగ్రసేనారెడ్డి, శివరామిరెడ్డి, కూడాల బాలనాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. బీసీ మాట్లాడుతూ సీఎం జగన్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. వైసీపీ దురాగతాలకు 70 రోజుల్లో ప్రజా కోర్టుల్లో శిక్ష తప్పదన్నారు. జగన్ అహంకారానికి, వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలోని వైసీపీ బాధితులు, రైతులు, నిరుద్యోగులు, మహిళలు టీడీపీ స్టార్ కాంపెయిన్స్‌గా మారారన్నారు. గతంలో రూ.200 ఉన్న విద్యుత్ బిల్లులు వైసీపీ అధికారంలోకి వచ్చాక ఐదు రెట్లు పెరిగాయన్నారు. నిత్యావసర వస్తువులతోపాటు ఆర్టీసీ బస్సుల చార్జీలు విపరీతంగా పెంచి ప్రజలను దోచుకుంటున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో చెర్లోపల్లె గ్రామంలో రూ. 1.57 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. టీడీపీని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్ రామకృష్ణారెడ్డి, గౌరురామిరెడ్డి, షేక్షావలి, పాపారాయుడు, ఉప్పరిగో పాల్, ఈశ్వరయ్య, నీలం దస్తగిరి, అర్జునుడు, బాలమద్దిలేటి, ఏసయ్య సుధాకర్, సురేశ్, సురేంద్ర, పక్కీరాగౌడ్, ఇంద్రసేనారెడ్డి, రగునాథరెడ్డి, వెంకటరమణనాయక్, వెంకటరాముడునాయక్, తిక్కన్నతోపాటు అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెర్లోపల్లెలో సూపర్ సిక్స్ కరపత్రాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

'టీడీపీతోనే పేదల సంక్షేమం'

చాగలమర్రి, జనవరి 29: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నాయకులు రఫిద్దీన్, అబ్దుల్లా అన్నారు. సోమవారం చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. వైసీపీ అరాచక పాలనకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. అక్రమ కేసులు, దాడులు అధికమయ్యాయని అన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, టీడీపీ నాయకులు బషీర్, నరసింహ, శ్యాబుల్, గైబువలి, కృష్ణ పాల్గొన్నారు.



చాగలమర్రిలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

బాబు వస్తేనే రాష్ట్రానికి మంచి రోజులు

టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి

ప్యాపిలి, జనవరి 29: చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 5వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందన్నారు. ఈ ప్రభుత్వంలో పేదలు మూడు పూటలా తిండి తినే పరిస్థితి లేదన్నారు. నిత్యావసర వస్తుల ధరలు ఆకాశాన్ని అంటడంతో పేద, మధ్యతరగతి వారు గగ్గోలు పెడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పేదరికాన్ని నిర్మూలిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌఖర్యంతో పాటు రైతులకు, యువతకు మేనిఫెస్టోలో ప్రాధాన్యం కల్పించినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. అనంతరం ఆయన ఇంటింటా తిరిగి మేనిఫెస్టో పత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళిక్రిష్ణ గౌడు, కాటమయ్య, చిన్నసుంకయ్య, ఆర్‌ఈ రాఘవేంద్ర, రామ్మోహన్‌యాదవ్, గండికోట రామసుబ్బయ్య, నాగేంద్ర, చల్లా వీరాంజినేయులు, గండికోట రామాంజినేయులు పాల్గొన్నారు.



మేనిఫెస్టో పత్రాలను అందజేస్తున్న సుబ్బారెడ్డి, నాయకులు

సమస్యలను పరిష్కరించాలి

డోన్(రూరల్), జనవరి 29: మండలంలోని గోసానిపల్లె గ్రామ నడిబొడ్డులో ప్రధాన రోడ్డులో ఉన్న మురికి కాలువ మట్టితో కూరుకుపోయిందని, ఆ సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు ఎం.శ్రీరాములు, యువ నాయకులు శివ కోరారు. ప్రధాన రోడ్డులోని ఇళ్ల ముందు వెళ్లే మురుగు కాలువ సగభాగం మట్టితో కూరుకుపోవడం వల్ల మురుగునీరు ఇళ్ల ముందర నిలిచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందనలో సమస్యపై అర్జీ పెట్టుకున్నా, నెలలు గడిచిపోతున్నా అధికారులు సమస్య పరిష్కారం పట్ల శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. దీంతో గ్రామ ప్రధాన రోడ్డులో ఉన్న స్థానిక వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.



గోసానిపల్లె ప్రధాన రోడ్డులో మట్టితో పేరుకుపోయిన కాలువ

యూపీఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

డోన్(రూరల్), జనవరి 29: డోన్ పట్టణం ఎంఈవో కార్యాలయ ఆవరణలో యూపీఎస్ఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల విద్యాధికారి ప్రభాకర్ చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ చిన్న ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల సమస్యలపై యూపీఎస్ఎఫ్ నిరంతర పోరాటాలు చేస్తోందన్నారు. యూపీఎస్ఎఫ్‌కు చిన్న ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో యూపీఎస్ఎఫ్ గౌరవా సలహాదారులు వెంకట్రామయ్య, డోన్ అధ్యక్షులు హరిశంకర్, కార్యదర్శి గిరిప్రసాద్‌రాజ్, కోశాధికారి పురుషోత్తం సభ్యులు వైష్ణవి, రఘు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి'

రుద్రవరం, జనవరి 29: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి సూచించారు. మండలంలోని నరసాపురం గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజరు మాట్లాడుతూ పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు.

ఆళ్లగడ్డలో షర్మిలకు ఘన స్వాగతం

ఆళ్లగడ్డ, జనవరి 29: కాంగ్రెస్ పార్టీ ఆళ్లగడ్డ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు స్వాగతం పలికారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిర్వహిస్తున్న కాంగ్రెస్‌పార్టీ సమావేశానికి సోమవారం వెళ్తూ మార్గమధ్యంలో ఆళ్లగడ్డలో కాసేపు ఆగారు. నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్, హుసేన్‌బాషా షర్మిలను గజమాలతో సన్మానించారు. అనతంతరం నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. నాయకులు సంజీవకుమార్, వెస్లీ, శిరివెళ్ల, రుద్రవరం, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ మండలాల్లోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న షర్మిల

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బేతంచెర్ల, జనవరి 29: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డోన్ సామాజిక కార్యకర్త మహ్మద్ రఫి, జ్ఞాన సరస్వతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, జిల్లా రెడ్ క్రాస్ కార్యవర్గ సభ్యులు నాగ సురేంద్ర అన్నారు. సోమవారం పట్టణంలోని జ్ఞాన సరస్వతి కళాశాలలో రెడ్ క్రాస్ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

నాయకత్వ నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ తరగతులు

బేతంచెర్ల, జనవరి 29: మాల్దీవుల నుంచి చట్టసభలకు ఎన్నికైన అధ్యక్షులకు, కౌన్సిలర్లకు నాయకత్వం నైపుణ్య అభివృద్ధిపై శిక్షణా తరగతులను డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి అవగాహన కల్పించారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నాయకత్వ నైపుణ్య అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, మండల రాష్ట్ర కేంద్ర నిధుల విడుదల అభివృద్ధి పథకాల కార్యక్రమాలపై అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజ్మెంట్ ప్రోగ్రాం అధికారి శిరీష, ఈవోఆర్‌డీ రంగనాయక్, మండల స్థాయి అధికారులు, వేల్ఫేర్ అసిస్టెంట్లు, మాల్దీవుల నుంచి చట్టసభలకు ఎన్నికైన అధ్యక్షులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి: అఖిలప్రియ



అఖిలప్రియ దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిక

ఆళ్లగడ్డ, జనవరి 29: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని అఖిలప్రియ గృహంలో సోమవారం కోటకందుకూరు గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ చాంద్ బాషా ఆధ్వర్యంలో 15 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందన్నారు. పెద్దసుబ్బయ్య, నడిపి సుబ్బయ్య, డి.నరేష్‌కుమార్, వక్కపేళ్ల మహబూబ్‌బాషా, కరీంబాషా, సుంగల హుసేన్‌వలి, దొరబాబు, సాదిక్‌హుసేన్, చరణ్‌కుమార్ తదితరులకు టీడీపీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. భార్గవ్‌రామ్ నాయుడు తదితరులు ఉన్నారు.

'రిటైర్మెంట్ ప్లానింగ్ ఉండాలి'



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ రవీందర్

ఆళ్లగడ్డ, జనవరి 29: ప్రతి ఒక్కరికీ రిటైర్మెంట్ ప్లానింగ్ ఉండాలని కర్నూలు ఈపీఎఫ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రవీందర్ సూచించారు. పట్టణంలోని భారతీ విద్యా మందిర్‌లో సోమవారం ఈపీఎఫ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈపీఎఫ్‌కు అర్హత గల ఉద్యోగులు ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను తెరచుకొని ఇందులో పొదుపు చేసుకోవడం ద్వారా మంచి ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. సమావేశంలో హెచ్ఎం సావిత్రమ్మ, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి సోమేశ్వరరావు, సునిల్‌కుమార్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

'కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయించాలి'

ఆళ్లగడ్డ, జనవరి 29: మంగళ వాయిద్య కళాకారులకు సంగీత పాఠశాల నెలకొల్పడానికి నాయి బ్రాహ్మణులకు కమ్యూనిటీ హల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని నాయిబ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు బాల నరసింహులు కోరారు. నాయిబ్రాహ్మణులు సోమవారం ఆళ్లగడ్డ తాహసీల్దార్ హరినాధరావును సన్మానించి వినతి పత్రం అందించారు. నాయిబ్రాహ్మణులు ఆర్థికంగా ఎదిగేందుకు తమ వంత సహకారాన్ని అందించాలని వారు కోరారు.

రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులు నిలిపివేయాలి

డోన్(రూరల్), జనవరి 29: రైల్వేఅండర్ పాస్ బ్రిడ్జి పనులు నిలిపివేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అంజినేయులు జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం మండలంలోని వెంకటనాయునిపల్లె రైల్వే గేట్ల అండర్‌పాస్ బ్రిడ్జి పనుల వద్దకు రైల్వే ఇంజనీరింగ్ అధికారులతో సీపీఐ నాయకులు గ్రామ ప్రజలతో కలిసి వాగ్వివాదానికి దిగారు. వెంకటనాయునిపల్లె గ్రామం మీదుగా దాదాపు పది గ్రామాల ప్రజలు అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద ఇబ్బందులు పడుతారనీ అన్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు బ్రిడ్జి కింద చేరి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. అండర్‌పాస్ బ్రిడ్జి స్థానంలో రైల్వేగేట్ల మీదుగా ఓవర్ ఫ్లోర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో రైల్వేగేట్లను యథాస్థానంలో ఉంచాలన్నారు.

డోన్ రూరల్ సీఐగా అస్రత్‌బాషా

డోన్(రూరల్), జనవరి 29: సాధారణ బదిలీల్లో భాగంగా డోన్ రూరల్ సీఐగా ఎస్.అస్రత్ బాషా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. అంతకుమునుపు ఎస్పీ రఘువీర్ రెడ్డిని, డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డితో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం జిల్లా నుంచి బదిలీపై డోన్ రూరల్ సీఐగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు.



డోన్ డీఎస్పీని కలిసిన సీఐ అస్రత్‌బాషా

'విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు'

చాగలమర్రి, జనవరి 29: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల అన్నారు. సోమవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్ల సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమయ పాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల

పశువులకు గాలికుంటు టీకాలు: ఏడీ

చాగలమర్రి, జనవరి 29: మండలంలోని ఆయా గ్రామాల్లోగల గేదెలు, ఆవులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు పశుసంవర్థశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. సోమవారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో గేదెలకు వేస్తున్న గాలికుంటు టీకాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 19 గ్రామ పంచాయతీల్లో గేదెలు, ఆవులకు పశువైద్య సిబ్బందిచే టీకాలు వేయించామని తెలిపారు. 15 వేల గేదెలు, ఆవులకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కోటయ్య, అంజి పాల్గొన్నారు.

యాగంటిలో శివ దీక్షలు ప్రారంభం

బనగానపల్లె, జనవరి 29: యాగంటిలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోమవారం శివదీక్షను స్వీకరించారు. ఆలయ గర్భగుడిలో పూజలు అనంతరం 33వ సారి శివదీక్షను స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు మహేశ్వరశర్మ, సత్యనారాయణశర్మ, కిశోర్‌శర్మల వేదమంత్రోచ్చారణల మధ్య ఆయన శివదీక్ష స్వీకరించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ కార్యదర్శి దస్తగిరిరెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



యాగంటిలో శివదీక్ష స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

బనగానపల్లె, జనవరి 29: బనగానపల్లె మండలంలోని తమ్మడపల్లె గ్రామంలో కేడీసీసీ బ్యాంక్ లావాదేవీలపై, సొసైటీల ఆర్థిక అక్షరాస్యతపై రైతులకు బనగానపల్లె బ్యాంక్ చీఫ్ మేనేజరు ప్రియాంక సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఘర్ ఘర్ కేసీసీ అభియాన్ కార్యక్రమంపై రైతులకు క్షుణ్ణంగా వివరించారు. సహకార సంఘాల్లో డిపాజిట్‌లో భాగంగా జీరో అకౌంట్, ఏటీఎం కార్డులు ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఒక సంవత్సరం వరకు ప్రధానమంత్రి సురక్ష యోజన కింద రూ.2లక్షల వరకు బీమా కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే ఫిక్స్ డిపాజిట్లపై కేడీసీసీ బ్యాంక్ అధిక వడ్డీ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భానుముక్కల సీఈవో అబ్దుల్‌మునాఫ్, సిబ్బంది షామీర్, సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా పోటీలు

బనగానపల్లె, జనవరి 29: బనగానపల్లె పట్టణంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుతాం ఆంధ్ర క్రికెట్ పోటీలు ముగిసినట్లు బనగానపల్లె నియోజకవర్గం ఇన్‌చార్జి పీడీ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. బనగానపల్లె సచివాలయం -4, పరిధిలోని విద్యార్థులు, మహిళా క్రికెట్ విభాగం నందు కోవెలకుంట్ల సచివాలయం - 4 పరిధిలోని విద్యార్థులు, పురుషుల బ్యాడ్మింటన్ విభాగంలో కోవెలకుంట్ల సచివాలయం -5, మహిళా బ్యాడ్మింటన్ విభాగంలో బనగానపల్లె సచివాలయం -3, కబడ్డీ పోటీల్లో బనగానపల్లె సచివాలయం 5, మహిళా విభాగంలో గుండ్ల శింగవరం, ఖోఖో పోటీల్లో పురుషుల విభాగంలో టంగుటూరు, మహిళా విభాగంలో బనగానపల్లె సచివాలయం 1, వాలీబాల్ పోటీల్లో పురుషుల విభాగంలో బనగానపల్లె సచివాలయం 2, మహిళా విభాగంలో గుండ్లశింగవరం విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. తెలిపారు. వీరికి ఎంపీడీవో కార్యాలయంలో మెమొంటోలు, నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

యాగంటిలో ఘనంగా పల్లకి సేవ



పల్లకిలో స్వామి,అమ్మవార్ల ఊరేగింపు

బనగానపల్లె, జనవరి 29: యాగంటి ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకిసేవ ఉత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

వాల్మీకి గుహలు జిల్లాకే తలమానికం

ఆర్థిక మంత్రి బుగ్గన



వాల్మీకి గుహలను ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

ప్యాపిలి, జనవరి 29: వాల్మీకి గుహలు జిల్లాకే తలమానికంగా ఉన్నాయని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బోయవాండ్లపల్లి గ్రామం సమీపంలో రూ.3 కోట్లతో అభివృద్ధి చేసిన వాల్మీకి గుహలను ఆయన కర్నూలు జడ్పీ చైర్మన్ పాపిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శాతాబ్దాల క్రితం వెలసిన ఈ గుహలను అభివృద్ధి చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందుగా రూ. 6కోట్లతో ఏర్పాటు చేసిన పెద్దపాయి, రాచవాండ్లపల్లి రోడ్లను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, నాయకులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, రాజానారాయణమూర్తి, మెట్టు వెంకటేశ్వర రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రెడ్డి, కంట్రాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రూ.351 కోట్లతో శాశ్వత తాగునీటి పరిష్కారం

బేతంచెర్ల, జనవరి 29: డోన్ నియోజకవర్గ ప్రజలకు రూ.351 కోట్లతో గోరుకల్లు వాటర్ గ్రిడ్ పథకం ద్వారా శాశ్వత తాగునీటిని అందించడమే లక్ష్యమని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం నంద్యాల జిల్లా డోన్ సబ్ డివిజన్‌లో బేతంచెర్ల పట్టణంలో ఆధునీకీకరించిన పోలీస్‌స్టేషన్, నూతన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ఆయనతో కలిసి కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డిలు ప్రారంభించారు. మండలంలోని కనుమకింది కొట్టాల సమీపంలో ఉన్న బిల్వ స్వర్గం గుహలను, రూ.2.5 కోట్లతో అభివృద్ధి చేసిన పనుల శిలాఫలకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, కర్నూలు జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, రాష్ట్ర వేర్‌హౌసింగ్ డైరెక్టర్ బాబు రెడ్డి, డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, బేతంచెర్ల సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్, డోన్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్లు ఎస్ఐలు, ఉర్దూ అకాడమీ సభ్యులు ముర్తుజావలి, హుసేన్ పాల్గొన్నారు.